క్లుప్తంగా

నేటి నుంచి స్వాములకు సద్ది



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు ముగ్గురు తల్లుల మూలపుటమ్మ గ్రామ దేవతలైన శ్రీ ముత్యాలమ్మ, శ్రీ కట్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవాలయంలో అయ్యప్ప ఆశీస్సులతో పాలస్వామి గురుస్వామి ఆధ్వర్యంలో నేటి నుంచి 46 రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శ్రీ కట్లమ్మ తల్లి దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 19వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మంగళవారం తెలిపారు. అయ్యప్ప, భవానీ, శివ స్వాములు సద్ది చేసేందుకు విచ్చేసి జయప్రదం చేసి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని పేర్కొన్నారు. గురుస్వామి ఆధ్వర్యంలో 11 మందికి అయ్యప్ప మాలధారణ ఏర్పాటు చేశారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి

కొల్లిపర: తమకు ప్రభుత్వం కనీస వేతనం చెల్లించాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, కమ్యూనిటీ వర్కర్స్ ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని, 5జీ మొబైల్స్ అందించాలని కోరుతూ మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డాక్టర్ నేహకు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా కార్యకర్తల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా టీఏ,డీఏలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఎం.జయప్రద, ప్రసన్న కుమారి, శివలీల, తిరుపతమ్మ, లంక పద్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయం



మంగళగిరి టౌన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి హేయమైనదని ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్, పలువురు వామపక్ష నేతలు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నేతలు మాట్లాడుతూ ఈ దాడితో యావత్ భారత్ ఆందోళనకు గురైందన్నారు. ఇది భారత రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. కుల, మత అహంకారంతో ఈ ఘటన ముడిపడి ఉందని, ప్రపంచ వ్యాప్తంగా భారతదేశంలో జరుగుతున్న అక్రమాలు ఎక్కడా లేవన్నారు. దేశంలో మత కల్లోలాలు సృష్టించే వ్యవస్థ బయలుదేరిందని, రాబోయే రోజుల్లో మతోన్మాదులకు బుద్ధి చెప్పాల్సిన అవశ్యకత ఉందని, దీనిపై గురువారం మరో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ సెక్రటరి డేవిడ్, సీపీఐ నాయకులు అన్నవరపు ప్రభాకర్, కంచర్ల కాశయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి అలవాట్లు నేర్పించండి

తెనాలిఅర్బన్: విద్యార్థి దశ నుంచే పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. ఆశాడే వేడుకలను సాలిపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రపరచుకోవాలన్నారు. అలా చేయకపోతే నోటి ద్వారా బ్యాక్టీరియా శరీరంలోకి వెళ్లి వాంతులు, విరేచనలు, డయేరియా వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యాధికారి డాక్టర్ బీవీ కిషోర్ మాట్లాడుతూ గర్భ నిర్ధారణ కిట్లను అందుబాటులో ఉంచుకుని అవసరమైన వారికి పరీక్షలు చేయాలని సూచించారు. అనంతరం కొత్తపేటలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు దేవరపల్లి సుభాష్ రమాదేవి, వేముల ప్రియాంక, హాస్టల్ ప్రిన్సిపాల్ ఈరుగంటి నిరీక్షణరావు, మలేరియా అధికారులు చిరసాని ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిలిచిన ఎక్స్‌రే సేవలు.. రోగుల ఇక్కట్లు

తెనాలిఅర్బన్: విద్యుత్ అంతరాయం కారణంగా జిల్లా వైద్యశాలలో సుమారు గంట పాటు ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. విద్యుత్‌శాఖ సిబ్బంది మంగళవారం ఉదయం వైద్యశాల రోడ్డులో విద్యుత్ వైర్లపై ఉన్న చెట్టు కొమ్మలను కొట్టారు. దీంతో వారు విద్యుత్‌ను నిలిపివేయడంతో జిల్లా వైద్యశాలలో ఎక్స్‌రే సేవలు అంతరాయం కలిగినాయి. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సేవలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ఎక్స్‌రే కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు.

పరిసరాల పరిశుభ్రతలో క్లాప్‌మిత్రల పాత్ర కీలకం





ఈస్ట్ బాపట్లలో క్లాప్ మిత్రలకు రక్షణకిట్లు అందజేస్తున్న బాపట్ల ఆర్డీఓ గ్లోరియా: అరుంబాక గ్రామంలో పంట నమోదు రికార్డులను పరిశీలిస్తున్న రేపల్లె ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి

బాపట్ల ఆర్డీఓ గ్లోరియా

బాపట్లటౌన్: పరిసరాల పరిశుభ్రత క్లాప్ మిత్రలతోనే సాధ్యమని ఆర్డీఓ గ్లోరియా తెలిపారు. మండలంలోని ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీలో పని చేసే క్లాప్ మిత్రలకు మంగళవారం రక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఆర్డీఓ గ్లోరియా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో కీలకపాత్ర పోషిస్తున్న క్లాప్ మిత్రాల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధికారిపై ఉందన్నారు. వారికి అవసరమైన దుస్తులు, కొబ్బరి నూనె, సబ్బులు క్రమం తప్పకుండా పంపిణీ చేయాలన్నారు. క్లాప్ మిత్రలకు యూనిఫామ్‌తోపాటు నెలకు రూ. 10 వేల వేతనం అందజేసి వారికి గౌరవించడం హర్షనీయమన్నారు. రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ, తహసీల్దార్ షేక్ సలీమా, ఎంపీడీఓ బి.బాబురావు, కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

20లోగా రైతులు పంట నమోదు చేసుకోవాలి : రేపల్లె ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి

చెరుకుపల్లి: ప్రతి రైతు ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈ నెల 20వ తేదీ లోపు పంట నమోదు చేయించుకోవాలని రేపల్లె ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఆరుంబాక, గూడవల్లి గ్రామాలలో పంట నమోదుకు సంబంధించిన సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ స్థానిక తహసీల్దార్ సిహెచ్ పద్మావతి, మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూక్‌లతో రైతుల పొలాలకు వెళ్లి రైతు పేరు, పంట రకం, పంట పేరు, విత్తిన తేదీ, సర్వే నెంబరు సక్రమంగా ఉన్నాయా లేవా అని క్షుణ్ణంగా తనిఖీ చేసి సూపర్ చెక్ యాప్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 80శాతం పంట నమోదు జరిగిందని ఇంకా 20 శాతం ఏరియా పంట నమోదు జరగలేదని వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏఈఓలు, వీఆర్వోలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి పాటుపడిన శంకరన్

యనాది హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు తిరువీధుల శంకరప్రసాద్



శంకరన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బాపట్లటౌన్: ఐఏఎస్ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ పేదల అభ్యున్నతి కోసం విశేష కృషిచేసిన ఘనత ఎస్ఆర్ శంకరన్‌కే దక్కిందని యనాది హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు తిరువీధుల శంకరప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణంలోని శంకరన్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. తిరువీధుల శంకరప్రసాద్ మాట్లాడుతూ దళిత, గిరిజన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎస్.ఆర్.శంకరన్‌ను స్ఫూర్తిగా తీసుకొని పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. చెంచు, యానాది, గిరిజన, దళిత, పేదల అభ్యున్నతికోసం తన సంపదన ఖర్చుపెట్టిన ఘనుడు అన్నారు. నీతి, నిజాయితీ, నిస్వార్థానికి మారుపేరుగా నిలచిన ఘనత శంకరన్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ నాయకులు షేక్ కరీముల్లా, టి.మల్లికార్జున రెడ్డి, గేరా రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ శంకరన్‌కు ఘననివాళి

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో దివంగత ఎస్ఆర్ శంకరన్ చిత్రపటానికి సర్పంచ్ నీలా ఉషారాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళవారం వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, పంచాయతీ, సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అక్రమ అమ్మకాలను నిరోధించాలి

ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బందికి సూచనలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ

వేమూరు (కొల్లూరు): నకిలీ, అక్రమ మద్యం అమ్మకాలను నిరోధించడానికి సిబ్బంది అనుమానిత ప్రాంతాలలో దాడులు ముమ్మరంగా చేపట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ అన్నారు. మంగళవారం ఆమె వేమూరు ఎక్సైజ్ శాఖ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆమె అన్నమయ్య జిల్లా ములకల చెరువులో ఇటీవల పట్టుకున్న నకిలీ మద్యం కేసు తీవ్రతను సిబ్బందికి వివరించారు. అనంతరం వేమూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులు, వాటి పురోగతికి సంబంధించి పలు సూచనలు చేశారు. మద్యం దుకాణ దారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపార లావాదేవీలు జరిపేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ ఎ.రవి, ఎస్ఐ జె.శ్రీరామ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం



108 అంబులెన్స్‌లో జన్మించిన శిశువు

చుండూరు(వేమూరు): చుండూరు మండలం కారుమూరువారిపాలెంలో మంగళవారం ఓ గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే బిడ్డకు జన్మనిచ్చింది. చుండూరు మండలం కారుమూరు వారిపాలెం గ్రామానికి చెందిన పెరుమాళ్ళ శ్రీలక్ష్మికు మంగళవారం తెల్లవారుజామున పురిటినొప్పులు ప్రారంభం కావటంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. చుండూరు అంబులెన్స్‌లో ఆమెను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా పురిటినొప్పులు అధికమయ్యాయి. కూచిపూడి లాకుల వద్ద ఆమెకు ఈఎంటీ కె.అనీల్‌బాబు, పైలెట్ కె.నవీన్‌కుమార్‌లు వైద్య సేవలు అందించటంతో మహిళ పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సకాలంలో స్పందించి, అత్యవసర వైద్య సేవలు అందించిన 108 సిబ్బందిని మహిళ కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

జిల్లా కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ అధికారిణి బిట్రా జయంతి



విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్న జయంతి

చెరుకుపల్లి: ప్రతి ఒక్కరూ ప్రతి రోజు యోగా సాధన అలవర్చుకుని ఆరోగ్యంగా ఉండాలని జిల్లా కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ అధికారిణి బిట్రా జయంతి తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్రశిక్ష బాపట్ల జిల్లా వారి ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పొన్నపల్లి జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బ్రీతింగ్ ఎక్సైర్‌సైజ్, ప్రాణాయామ, యోగా, ఆసనాలను చేయించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో డీసీడీఓ చారులత, ఎంఈఓలు పులి లాజర్, టి.నవీన్‌కుమార్, పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పని గంటల పెంపును ఉపసంహరించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

తాడేపల్లి రూరల్: పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం తాడేపల్లి రూరల్‌లోని ఉండవల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో కార్పొరేట్ల మెప్పుకోసం పని గంటలుపెంచి రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు తీరని ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఫ్యాక్టరీల చట్టం 1948కి ప్రభుత్వం చేసిన సవరణలు కార్మికులను బానిసలుగా మారుస్తాయని, దీన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మేడే స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పని గంటలను కార్మిక వర్గం అంతా సంఘటితమై అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ లో ఓల్టేజ్‌కు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

అమృతలూరు (కొల్లూరు): విద్యుత్తు లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం విషయంలో విద్యుత్తు శాఖాధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఇంటూరు మసీదు ప్రాంత వాసులు మంగళవారం తెలిపారు. మండలంలోని ఇంటూరులో మసీదు ప్రాంతంలోని 1, 2వ వార్డులలో గత 12 ఏళ్లుగా ప్రజలు లో వోల్టేజ్ సమస్యతో బాధపడుతున్నారని ఆయా వార్డుల నాయకుడు షేక్ సుభాని, సమాచార హక్కు చట్టం మండల అధ్యక్షుడు షేక్ నాగుల్ షరీఫ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పట్టించుకోకుండా కరెంట్ చార్జీలు చెల్లించే యంత్రాల్లాగా ప్రజలను విద్యుత్తు శాఖాధికారులు పరిగణిస్తుండటం దారుణమన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం చేపట్టనున్న కొవ్వొత్తుల ప్రదర్శనలో రెండు వార్డుల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెరుకుపల్లి-తెనాలి బస్సులు ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు నడపాలి

చెరుకుపల్లి: చెరుకుపల్లి వచ్చే తెనాలి ఆర్టీసీ బస్సులు ఐలాండ్ సెంటర్ నుంచి తిరిగి వెళుతున్నాయని వాటిని ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు పొడిగించాలని సీపీఐ ఎంఎల్ నాయకుడు మరివాడ వెంకటరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం చెరుకుపల్లిలో ఆయన మాట్లాడుతూ చెరుకుపల్లి వచ్చే తెనాలి ఆర్టీసీ బస్సులు ఐలాండ్ సెంటర్ నుంచి తిరిగి వెళ్ళటంతో సెంటర్‌కు దూరంగా మహిళలు, వృద్ధులు, ముఖ్యంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అందుకోసం గత 15రోజుల క్రితం చెరుకుపల్లి వచ్చే తెనాలి ఆర్టీసీ బస్సులు ఖాదర్‌ఖాన్ సెంటర్ వరకు రావాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందించామని ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరుకుపల్లి వచ్చే తెనాలి ఆర్టీసీ బస్సుల ను ఖాదర్‌ఖాన్ సెంటర్ వరకు నడపాలని కోరుతూ 140మంది ప్రయాణికుల సంతకాలతో తెనాలి ఆర్టీసీ అధికారులకు మరో మారు వినతి పత్రం అందించామన్నారు. ఆయన వెంట మండల ఓంకార్ సేవసమితి అధ్యక్షుడు గండే సాంబశివరావు, ఒరుగంటి వీరప్రసాద్, చింతక్రింద వెంకట సాంబశివరావు, తన్నీరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పులను అమలు చేయాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు స్టీవెన్, పిచ్చయ్య, సుభాని, సాంబశివరావు, నాగేశ్వరరావులతో కలసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు గత 308 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని ఇప్పటికైనా కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై, ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, దుర్గాభవాని, శివకుమారి, గురవయ్య, ఆశీర్వాదం, శారమ్మ, రమాదేవి, రిబ్కా, సువర్ణకుమారి, కాసమ్మ, అంకయ్య, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ఎంఈఓ కెన్నడీ



కాకుమాను: నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలు ఎంతో ప్రాముఖ్యమైనవని ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్. కెన్నడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.జీ.ఎఫ్. ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో రాణించాలని ఆయన సూచించారు. ప్రముఖ క్రీడాకారులను స్మరించుకుంటూ వారిని ఆదర్శంగా తీసుకుని క్రీడలలో రాణించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నిర్వహించారు. మండలంలోని కొమ్మూరు, బోడిపాలెం, కొండపాటూరు, రేటూరు, గరికపాడు, ఏ.పీ.ఎస్. డబ్ల్యూ ఆయా పాఠశాలలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం జీ.వీ.బి. వెంకట్రావు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో కూటమి సర్కారు విఫలం

ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను నాయక్

బాపట్లటౌన్: గిరిజనులకు కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయడంలో కూటమి సర్కారు విఫలమైందని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా గిరిజనులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించడంలో విఫలమయిందన్నారు. ఎటువంటి పూచీకత్తు లేకుండా గిరిజనుల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసి సుమారు రూ.5 లక్షల వరకు రుణాలు అందిస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ముఖ్య నేతలు తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, నాయకులు టి.ఏడుకొండలు పాల్గొన్నారు.

మండలానికి రెండు స్వచ్ఛ అవార్డులు హర్షణీయం

ఎంపీడీఓ మహబూబ్ సుభాని



కలెక్టర్ వినోద్ కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న రాజవోలు సర్పంచ్, కార్యదర్శి

చెరుకుపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగు పరిచేందుకు, మరింత ప్రోత్సాహానికి ప్రభుత్వం అందజేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ఎంతగానో దోహదపడతాయని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని అన్నారు. సందర్భంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో స్వచ్ఛ గ్రామ పంచాయతీగా రాజవోలు గ్రామం, మరియు పాఠశాల విభాగంలో కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో స్వచ్ఛ పాఠశాల అవార్డు లభించిందన్నారు. మండలానికి రెండు అవార్డులు రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. సోమవారం బాపట్లలో జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ నుంచి ఈ అవార్డు అందుకున్నట్లు సుభాని తెలిపారు. సందర్భంగా రాజవోలు గ్రామ సర్పంచ్ తాతా వెంకటేశ్వర్లును, కార్యాదర్శి లుక్కా పూజితాను కావూరు పాఠశాల హెచ్ఎం వనజాక్షిని, పాఠశాల ఉపాధ్యాయులను, విద్యార్థులను సుభాని అభినందించారు.

ఇంటివద్దే కూరగాయలు పండించుకోవాలి



భట్టిప్రోలులో ఓ ఇంటి పెరటిలో పండిన పంటలను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంపూర్ణ

భట్టిప్రోలు: రసాయన ఎరువుల వాడకం లేని కూరగాయలు, ఆకు కూరలను సేంద్రియ పద్ధతిలో అంగన్‌వాడీ కేంద్రాల సహకారంతో ప్రతి ఒక్కరూ ఇంటి వద్దనే పండించుకోవాలని భట్టిప్రోలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ బి.సంపూర్ణ కోరారు. మంగళవారం భట్టిప్రోలు సెక్టార్ పరిధిలోని పలు గ్రామాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న పెరటి తోటలు, కిచెన్ గార్డెన్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సంపూర్ణ మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలను స్వచ్ఛందంగా పండించుకోవడం వల్ల కుటుంబానికి కూరగాయలు ఖర్చు తగ్గడమే కాక ఆరోగ్యకరమైన ఉత్పత్తులను కూడా పొందవచ్చునని తెలిపారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలులో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పలు సలహాలు, సూచనలను అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'జల్ జీవన్ మిషన్' అమలులో విఫలం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు సాంబశివరావు

కర్లపాలెం: మండలంలో జల్ జీవన్ మిషన్ అమలు చేయటంలో ఆ శాఖ అధికారులు విఫలమయ్యారని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు ఆరోపించారు. నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ పరిధిలోని కొత్త నందాయపాలెం గ్రామ పంచాయతీ గ్రామ సభ మంగళవారం సర్పంచ్ ఆట్ల వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ గ్రామసభకు హాజరైన ఎంపీటీసీ తాండ్ర మాట్లాడుతూ కొత్త నందాయపాలెంలో ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేసేందుకు జల్‌జీవన్ మిషన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.26.50లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. జల్ జీవన్ మిషన్ పనులు పూర్తయినట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారని ఇంకా గ్రామంలో 120 గృహాలకు కొళాయిలు ఏర్పాటు చేయలేదన్నారు. ఈవిషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వసుధను ఎంపీటీసీ సాంబశివరావు వివరణ కోరారు. ఈ విషయమై ఏఈ మాట్లాడుతూ మిగిలిన ఇళ్లకు కూడా కొళాయిలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని ఆమె తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మురళీరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల విక్రయాలు అరికట్టాలి



ఐద్వా పతాక ఆవిష్కరణలో మహిళా నాయకులు

తాడేపల్లి రూరల్: మద్యం, మత్తు పదార్థాల విక్రయాలను రాష్ట్ర ప్రభుత్వ అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో ఐద్వా తాడేపల్లి పట్టణ 6వ మహాసభను కార్యదర్శి గిరిజ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సంఘ పతాకాన్ని బాలబొమ్మలు విష్కరించారు. అనంతరం మహిళా ఉద్యమ మణిపూస మానికొండ సూర్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస కుమారి మాట్లాడుతూ మతోన్మాదం, ప్రైవేటీకరణ విధానాలతో మహిళలకు భద్రత కరువైందన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింస, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో కుటుంబాలు ఛిద్రమౌతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, మత్తు పదార్థాలతో దేశానికి ఉపయోగపడాల్సిన యువశక్తి నిర్వీర్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని, ఇళ్ల పట్టాల కార్యక్రమం వేగవంతం చేయాలని, ఇల్లులేని పేదలకు రెండు సెంట్ల స్థలంఇవ్వాలని, రేషన్ షాపును ఏర్పాటు చేయాలని, మహిళలపై దాడులు, అకృత్యాలను అరికట్టాలని, డ్వాక్రాలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించాలని కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో ఐద్వా నాయకులు, కీర్తన, జ్యోతి, భ్రమరాంబ, ఉష తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

భట్టిప్రోలు: అనారోగ్యాలతో వివిధ ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స చేయించుకుంటున్న కొల్లూరు మండలానికి చెందిన 15 మంది వైద్య చికిత్స ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి వచ్చిన చెక్కులను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధితులకు అందజేశారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మొత్తం రూ.7,34,847 విలువైన చెక్కులను అందజేశారు. బాధితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.